# మా కళాకారుల సంఘం

"అనామక శ్రీ"

స్కెచ్

మేము కళాకారులమండీ! కంట్రాక్టర్లము కాము! దారినపొయ్యే ప్రతీవానయ్యా మమ్మల్ని విమర్శించడమే! అది కేవలం మాకు లభిస్తూన్న కీర్తి ప్రతిష్ఠలమీద ఈర్ష్యే ననుకోండి! అయినానూ...మాలో నేనే ముఖ్యుణ్ణి లెండి. నాకేమీ ఉద్యోగంలేదు. కళాసేవ - తన్మూలంగా ప్రజాసేవ - చెయ్యడమే నాకు ముఖ్యమైన పని. మా రామ్మూర్తికి ఓ ప్రెస్సూ, ఒకపాక్షిక-కాదు, కాదు-పక్షపత్రికా (ఈరోజుల్లో ఏమాట అందామన్నా భయమేస్తోంది) ఉన్నాయి. మా భీమారావుకి బజారులో ఓపెద్ద ఫేన్సీషాపూ, రెండు మూడు భవంతులూ ఉన్నాయి. మరి మా రెడ్డికి దుర్గాపురంలో పాతిక గరిసెల ధాన్యమొచ్చే భూవసతి వుంది. ఇక పోతే మిగిలినవాడు జోగిరాజు చౌదరి – ఆంధ్ర దేశంలో ప్రఖ్యాతిగాంచిన కథకుడు. మేము అయిదు గురం పంచపాండవుల్లా ఒకదగ్గిరచేరి నాటకరంగాన్ని ఏవిధంగానైనా పైకి తీసుకువచ్చి, అందులో ఏమెచూర్ నటులున్నారే-ఔత్సాహిక నటులు-వాళ్ళనుద్ధరించాలని మా సంకల్పం. దాంతో మాలో ఒకనటుడు కూడా వుంటే బాగుంటుందని పించింది. ప్రొఫెసర్ పొణుగుపాటిని ఆహ్వానించాం. ఆయన సహృదయుడు-వెంటనే అంగీకరించాడు.

మేము సంవత్సరానికొకసారి ఏదో పేరుపెట్టి నాటకాలు వేయించి ఏదో మాకు తోచిన రీతిని ఉత్తమ కళాకారులని సన్మానిస్తూ వస్తున్నాం. ముందుగా నాటక సమాజాలకీ, ప్రజలకీ విజ్ఞప్తులు చేస్తున్నాం. దేనికైనా డబ్బు రావాలిగా మరి! చిన్న టిక్కెట్టుపెట్టి - ఓ రూపాయనుకోండి-విరాళాలు వసూలు చేస్తున్నాం. ఇక్కడే వచ్చింది తగువు. ఇందులో మాకే ఏదో మిగిలిపోతోందనీ, అట్టే మాట్లాడితే భోజనాల దగ్గిరా, ప్రయాణ బత్తేలదగ్గిరా మిగుల్చుకుని మోడిచేస్తున్నామనే ఒక పుకారు లేవదీశారు మా ప్రత్యర్థులు.

ఎవరేమనుకున్నా మా కళాసేవ మేం మానం. ఒక శుభముహూర్తాన మా జీవితాలు ఆ కళామతల్లి పాదాలదగ్గిర అంకితమయిపోయాయి. అందుకనే ఈయేడు కొత్త రేటుపెంచి, కార్యక్రమం కూడా విస్తృత పరిచాం. నటసన్మానం, సాహిత్యగోష్ఠి, మహాకవి సన్మానం, ఏర్పాటు చేశాం. ప్రఖ్యాతసినిమానటుడు ప్రాణేశ్వర్రావుని తీసుకువచ్చి నటసన్మానం చేశాం. మన ఆంధ్రదేశంలో ఉన్న పేరుకెక్కిన కవులు—భావానందం, సో.వా., నసీ. మా, చిత్త, ఆ కవి శ్రీ; కొ. జా. మూర్తి; ప్రయోజనాలు; కామకంకర్., మొదలైన కవుల్నందర్నీ రప్పించి, సాహిత్యగోష్ఠి జరిపించాం. మహా కవి బసవనాధుడికి కవి సన్మానం చేసి నాటపదహార్లు యిచ్చుకున్నాం. ఆంధ్రదేశంలో వివిధ కేంద్రాలనుండి వచ్చిన యిరవై నాటకాలూ, ముప్పై నాటికలూ ఆడించాం. ఇందులో సంస్కృతం హిందీ, ఉర్దూ నాటకాలు కూడా ఉన్నాయి. నిష్పాక్షికులైన జడ్జీలను నియమించి, వాళ్ళిచ్చిన తీర్పును సీలుకవరు స్టేజీమీదనే చించి—చదివాను. ఇంత సమున్నతంగా కళాసేవ మేము చేస్తూవుంటే సంఘానికీ అందులో నాకూ, ఏదోకించిత్తు పేరూ, ప్రతిష్ఠాకలగడం సహజం. దాన్నిచూసి కొంతమంది 'ఆంధ్రులు' ఏదో కూస్తున్నారట.

వాళ్ళ మొదటి కూత, ఇంతమంది స్టేజీనటులుండగా, నాటకోత్సవాల పేరుపెట్టీ కూడా సినిమానటుడికి సన్మానం చెయ్యడం తప్పట. సినిమానటనకంటే స్టేజినటన కష్టమైనదిటా, అంచేత ఆనటసన్మానం ఏ స్టేజీనటుడికైనా చెయ్యకూడదా అని వాళ్ళప్రశ్న. ఎందుకు చెయ్యకూడదూ? చెయొచ్చు! చేశాం! చేస్తున్నాం! చేస్తాం! అయినా నటనకిన్ని విభేదాలేమిటండీ! నటన నటనే! ప్రాణేశ్వర్రావు ప్రఖ్యాతాంధ్ర నటుడు అని భావించి మేము సన్మానం చేశాం. కాని సినిమా నటుడని చెయ్యలేదు. ఈ సన్మానానికి

అందర్నీ హాల్లోకి వొద్దల్లేదుట. ఇది వాళ్ళ రెండో కూత. ప్రాణేశ్వరరావుని స్టేజ్ మీద పెట్టి బయట టిక్కెట్లమ్మేరట. అమ్మేరటండీ! కళ అంటే తెలియని ప్రతీ ఓబయ్య వచ్చేసి ప్రాణేశ్వరరావుమీద నెక్కేస్తే ఎలాగండీ! పోనీ నన్ను తిట్టారంటే బాగుంది. ప్రాణేశ్వరరావునికూడా తిట్టడం ఆరంభించారు. డబ్బు కలక్షను—చెప్పొద్దూ టిక్కెట్లు బాగానే అమ్ముడు పోయాయి. అతడి పేరుమీదుగా జరుగుతూవుంటే, అతణ్ణి చూడ్డానికి వచ్చిన జనం అయిదేసి రూపాయలు ముడుపు చెల్లించుకోవలసివస్తే తెలిసీ వూరుకున్నాడనికూడా అంటున్నారట. అతడు మా ఆతిథ్యంలో మేమిచ్చిన కార్యక్రమం ప్రకారం నడవటమే ధ్యేయంగా పెట్టుకున్నాడు. అంతేకాని అతణ్ణనకూడదు. పోనీ అలాగేనండీ! ఆ డబ్బు ఎందు కుపయోగపడిందో ఆలోచించరేం?

దీనికిలా సొడ్డుపెట్టి మర్నాడు సాహిత్యగోష్ఠి ఏర్పాటుచేసి అందర్నీ పిలిస్తే—దానికి టిక్కెట్టు లేదుకుమండీ — దానికెలా సొడ్డు పెట్టారో చూశారా! అసలు కార్యక్రమమేమో గోష్ఠి అన్నారంట. తీరా అక్కడికొచ్చాక అది కావ్య పఠనమైందట. ఈ ముక్క మేం ఎవర్నయితే మర్యాదగా పిలచి, పెద్దచేసి, తఖ్తుమీద కూచో పెట్టామో వాళ్ళే అన్నారు. ఇక పైవాళ్ళన్నా రంటే తప్పేముంది? గోష్ఠి నిర్వహించమని ఓ పెద్ద మనిషి చేతుల్లో పెట్టాము. కాని ఈ కవులున్నారు చూశారా వీళ్ళకి కండూతి జాస్తీ అండి. ఒక్కొక్కరూ దస్త్రంతిప్పి పద్యాలు చదవడం ప్రారంభించారు. ఇక నేనేం చేసేదిలేక తెల్ల ముఖం వేసుక్కూచున్నాను. దేనికి మేముమట్టుకు బాధ్యులంకాము.

ఇలాఅంటే వొదిలిపెట్టలేదండోయ్. మా వూళ్ళో ఆక్రోశం అని ఒకడున్నాడులెండి. వాడికి ఏ నాటకంలోనూ ప్రైజివ్వలేదని నామీద దుగ్ధ. దానికితోడు గోష్ఠికి వాడిని పిలవలేదులెండి! వాడేదో గిలుకుతాడన్న సంగతి నాకూ అంత బాగా తెలియదు. వాడంటున్నాట్ట—మేము సాహిత్యగోష్ఠికి వచ్చిన రచయితలకు దారి ఖర్చులివ్వలేదుట. అసలు విషయం చెప్పమంటారా కొంతమందికి-అంటే ప్రచారం లేనివాళ్ళకి-మేము ఖర్చులివ్వం వొస్తే రండి లేకపోతే మానెయ్యండి అని స్పష్టంగా రాశాం. ఇంకా కొంతమందితో చిన్న ఎగ్రిమెంట్లు చేసుకున్నాం. వాళ్ళకి ఖర్చులు మేమిస్తే వాళ్లు కొన్ని ప్రైజులు చదివించడానికి వొప్పుందం. ఇలాటివి ఏవో చేసి, మిగిల్చి నాటక ఉత్సవాలను దిగ్విజయంగా నడిపిస్తూ వుంటే సంతోషించటం మాని...

రచయితల గురించి ఒక్కమాట చెప్తా వినండి. వాళ్ళకి ప్రచారం కావాలి. వాళ్ళ రచనలు అందరూ విని మెచ్చుకోవాలి. ఈ కండూతీ కొంతమందికేనా తీరుతుందికదా అని, ఏదో మాకు కొంత సాహితీసేవ చేసిన ఫలం దక్కుతుందని చేశాం. అంతేనామరి? కృతిసమర్పణోత్సవంకూడా ఏర్పాటు చేశాం, నాటకోత్సవాలకీ, దానికీ సంబంధం లేకపోయినానూ! ఎందుకు—ఏతత్కవి మా చుట్టూ తిరిగి వేధించుకు తిన్నాడు. ఎలాగైతేనేం ఆ మంత్రిసత్తముడు—కృతిభర్త—రాలేదు. ఆ కన్యాదానం ఆగిపోయిందిగాని లేకపోతే అదోతట్ట మా నెత్తిన పడవలసిందే.

చూశారా! ఇలావుంది మా బతుకు. ఇక బసవనాథుడి సన్మానం ముచ్చట చెప్పతరంగాదు. వెయ్యిన్నూటపదహార్లు మేము ఇస్తామన్నామని ముందే ఓ పుకారు వెళ్ళతీశారు. కవి సన్మానం అనేసరికి ఊళ్ళో పిల్లకవులు బయల్దేరారండీ, మేం పద్యాలు చదువుతామంటే మేం పద్యాలు చదువుతామని. వాళ్ళందరికి జాగా ఇస్తే, ఉత్సవాలకి సమాప్తి పుష్కరాలు దాటిపోదూ? వాళ్ళంతా చేరి ప్రేక్షకుల్లో గొడవ లేవదీసి సంతృప్తిపడ్డారు. దానికి బసవనాథుడు బాగా సమాధానమిచ్చాడు లెండి. ఆయనెక్కడ! కవిచక్రవర్తి! ఆంగ్ల సాహిత్యాన్ని అవఘళించుకోడానికి ఇంగ్లీషు సినిమాలు చూస్తూవుంటాట్ట. (కొందరు నీచులంటారు-ఆయనకి ఆ సినీమాల్లో ముద్దులంటే మహాయిష్టమని.) "మీకు నా కవిత్వం అర్థమై ఏడిస్తేగా!" ఇలాగే అడిగాడు. దాంతో సోదరులకి మొగం మాడింది. ఆపాటి ప్రేక్షకులమీద 'కంట్రోల్' లేకపోతే ఎలాగ?

విడిదిలో కూచుని ఆయన ఈ మధ్యనే వ్రాస్తున్న "పారాయణం" విన్నాను. అద్భుతంగా వుంది. నిజంగా ఆయన మహాకవే. ఇంతకీ ఆయన మావాడు. ఆయనేంరాసినా మహాబావుంటుంది.

అతనికి ఆంధ్రదేశమంతా ఋణపడివుంది. ఆటువంటి మహామహుడి దర్శనం మావల్ల కలిగిందని సంతోషించకా...

ఇంకా ఏమిటేమిటో అంటున్నారుట మా ప్రత్యర్థులు. బహుమతుల నిర్ణయంలో ఏదో అన్యాయం జరిగిందనీ, ఈ విషయంలో 'నటన'కి ప్రాముఖ్యం ఇవ్వబడలేదనీ, మేం లంచాలు పుచ్చుకున్నామనీ-ఒకటేమిటి నా నోటికి రావు. అనేక మంది అనేకవిధాల అనుకుంటారు-అవన్నీ లెఖ్ఖపెట్టుకుంటే మన ఆదర్శం సిద్ధిస్తుందా?

విశాలాంధ్రలో మా బ్రాంచీలు అనేకం ఉన్నాయి. రాజమండ్రి, బందరు, ఎగువ తిరపతి, దిగువతిరపతి, పెద్దాపురం, హైద్రాబాదు నగరాల్లో అస్మదాతులు అంతాచేరి, ఆంధ్ర కళామతల్లికి (ఏడాదికోమారేసనుకోండి) నివాళీ పడుతున్నారు.

అందువల్ల సంపాదకమహాశయా! ఆంధ్రప్రజలు లేనిపోని అనుమానాలు పెంచుకుని, మాపట్ల సహాయ నిరాకరణం చెయ్యకుండా ఈ 'మాసంగతి' మీ పత్రికలో ప్రకటించమని కోరుతున్నాం.

[ఆవశ్యం మీ కోరిక నీడేర్చాము. ఇక జరగవలసిందల్లా యిది చదివి ఆంధ్రమహానులు "ఉచిత" రీతిని మిమ్మల్ని సత్కరించడమే.—సం. ॥తె. స్వ॥] ★

(13-వ పేజీ తరువాయి)

పైకి వస్తాయి. అలాగే శ్రీ పర్వతశ్రేణుల్లో ఎక్కడ చూచినా బౌద్ధ శిధిలాలే యీనాడు మనకి దివ్యక్షేత్రాలయ్యాయి. ఆంధ్రరాజులు, ఇక్ష్వాకులు బౌద్ధాన్ని పోషించారు. నాగార్జునాచార్యుడు వంటి ప్రవక్తలు అనేక గ్రంథాలు వ్రాసి థేరవాదాన్ని ప్రచారంలోకి తెచ్చారు. అయినప్పటికీ 1500 ఏండ్లకిపైగా మనం బౌద్ధాన్ని మరచిపోయాం. ఏవేవో కల్పించి బౌద్ధమతాన్ని, తదనుయాయుల్నీ దూషించాం...ఇప్పటికి బుద్ధజయంతి చేస్తున్నాం. ఈ ఉత్సవాల్లోకూడా యథార్థాన్ని విస్మరించి చిత్తశుద్ధిలేని ప్రసంగాలు చేస్తున్నాం. నిజానికి బుద్ధుని ప్రవచనాలు అర్థంచేసుకొని, వాటిని ఆధునిక కాలానికి అనుగుణంగా అన్వర్తింపచేయగల మేధావులుమనలో ఎందరున్నారు?

కనీసం-ఆచరణ యోగ్యంగా బుద్ధుని సత్యధర్మం, అహింసా విధానమైనా ఆధునిక యుగానికి మహాత్మ గాంధీవంటి మహా పురుషుడు తన జీవితంలో ప్రత్యక్షంగా చూడగలిగాడు. బుద్ధుని పంచశీల సిద్ధాంతాలు అధారంగా ఈనాటి సంక్షుభిత లోకంలో, సంఘర్షణ లేకుండా శాంతి సామరస్యాలు సమకూర్చడానికి గాంధీగారి వారసుడు పండిత నెహ్రూ ప్రయత్నం చేస్తున్నాడు. ఆయన ఆదేశం ప్రకారం దేశమంతటా జరిపిన యీ బుద్ధజయంతి ఉత్సవాలలో ఎంతవరకు మనం చిత్తశుద్ధితో చేసిందీ మనం ఒకసారి పరీక్ష చేసుకోవాలేమో.

మన ఉత్సాహంకొద్దీ మనం ఏం చేస్తున్నామో మనకే తెలియనట్టు ప్రవర్తించాం. ఈ బుద్ధజయంతి ఉత్సవాలలో—మనవాళ్ళు కొందరు నాట్య ప్రదర్శనాలు, బుద్ధ-బుర్రకథలు వినోదాలు, హాస్య కాలక్షేపాలు ఏర్పాటు చేశారట. ఇంతకంటే అన్యాయముందా? నాట్యంపేరున నాట్యమూ తెలియక శాస్త్రమూ తెలియక అవకతవక ప్రసంగాలతో అసహ్యచేష్టలు చేసే కొందరి అభినవ నాట్యాచార్యులచేత అసభ్య ప్రదర్శనం చేయించడం, విదూషకుడిచేత వినోదాలు చెప్పించడం ఎంత అపచారం? బుద్ధధర్మసారం తెలిసిన వాళ్లు ఇలాగ చెయ్యరు. ఈ ఉత్సవాలు మన వినోదానికా, విజ్ఞానికానికా? ఈ అవకాశం తీసుకొని మన అజ్ఞానాన్ని మరొక్కసారి ప్రపంచానికి ప్రకటించుకొని సంతసించాలా?

ఆంధ్రదేశపు పరిస్థితి ప్రస్తుతం ఎంత మేధాదారిద్ర్యానికి, అవకాశవాదానికి దిగజారిందో ఈ బుద్ధ జయంతి ఉత్సవాలు - దుర్భిణీ వేసినట్టు చూపాయి. ఈనాటి ఆంధ్రదేశ స్థితికి-ఏనాడో భర్తృహరి చెప్పిన సుభాషితం అక్షరదర్పణం పట్టియిస్తున్నది!

బోధలగువారు మత్సరపూర్ణమతులు
ప్రబలగర్వాంధ పూరితుల్ ప్రభువులెన్న
ఇతర మనుజు లబోధోపహతులు గాన
భావమున జీర్ణమయ్యె సుభాషితమ్ము!